సేవాలాల్ మహరాజ్‌కు ఘన నివాళి

సుల్తాన్‌బజార్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా శనివారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రాష్ట్ర కార్యాలయంలోని తెలంగాణ ట్రైబల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పాండు బి.నాయక్, తిరుపతి నాయక్, ఉపాధ్యక్షుడు మోతీలాల్ నాయక్, కోశాధికారి జగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. జాతిని జాగృతం చేయడంలో సేవాలాల్ మహరాజ్ చేసిన కృషి అమోఘమైందని కొనియాడారు. సేవాలాల్ జయంతికి ప్రభుత్వం స్పెషల్ క్యాజువల్ సెలవు దినంగా ప్రకటించడంపై ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.


ఉత్సవాల్లో వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ తదితరులు


డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో..

జాంబాగ్‌లో..

బీజేపీ ఎస్సీ మోర్చా సెక్రటరి జగపతి నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ హాజరై సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు రోహిత్‌కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీలో..

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ..సేవాలాల్ చేసిన సామాజిక సేవను గురించి వివరించారు. బ్రిటీష్ ప్రభుత్వం గిరిజనులపై చేసిన దమనకాండకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు.. సేవాలాల్ ఒక కులం గురించే కాకుండా అన్ని కులాలు గురించి పోరాడారన్నారు.

జంగమ్మెట్ డివిజన్‌లో..

చాంద్రాయణగుట్ట: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జంగమ్మెట్ డివిజన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఫలక్‌నుమా కాంటెస్టెడ్ కార్పొరేటర్ సభావత్ గిరిధర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సై నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు రాణా ప్రతాప్, కె.స్వరూప, రాంసింగ్ నాయక్, ఆకుల శ్రీనివాస్, చెన్నయ్యగారి సరిత, రాజేష్ నాయక్, రాము, గోపి, కిషన్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్


వేడుకల్లో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో రేణుకా ఎల్లమ్మ మహోత్సవాలు

జియాగూడ: ఇమాంపురా రేణుకా ఎల్లమ్మ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం నవ భారత సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాల్లో భాగంగా సాముహిక బోనాలు, పుట్టమన్ను తేవడం, గంగతెప్ప, పూజా కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, కుల్సుంపురా ఏసీపీ మునావర్, కార్పొరేటర్ బోయిని దర్శన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌బీఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ వారిని ఘనంగా సన్మానించారు.


ఉత్సవాల్లో సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్, దర్శన్, మధిర సత్యనారాయణ

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు: డీసీపీ..

బస్తీలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు చేయబడుతాయని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ అన్నారు. ఉత్సవాలకు హాజరైన సందర్భంగా ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇటీవల ఇమాంపురా బస్తీకి సుమారు 16 సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. డీసీపీ చంద్రమోహన్ ఎన్‌బీఎస్ కమ్యూనిటీ హాల్‌లో సీసీ కెమెరాలను కుల్సుంపురా ఏసీపీ మునావర్, కార్పొరేటర్ బోయిని దర్శన్, ఇన్‌స్పెక్టర్ సునీల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, వై.జస్వంత్‌కుమార్, ఎం.మహేష్‌బాబు, ఆర్.బాలకిషన్, డి.సంతోష్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, సి.బాబు, కె.శ్రీకాంత్, ఎం.దర్శన్, ఎం.నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి


ఉత్తమ పేరెంట్ రేణుకను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి తదితరులు

యాకుత్‌పురా: విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని దారుషిఫా ప్రభుత్వ ప్రత్యేక అంధుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఉత్తమ పేరెంట్‌గా 5వ తరగతి విద్యార్థి గోపి తల్లి రేణుక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీడిమెట్ల ప్రాంతంలో ఉండే పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి గోపిని తన తల్లి రేణుక ప్రతిరోజు పాఠశాలకు తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అంధుల సంక్షేమానికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జావిద్, రవీందర్‌రెడ్డి, జానయ్య, అంజాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి'

యాకుత్‌పురా: జడ్జిపై దాడికి పాల్పడిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లా కోర్టులో కేసు విచారణ చేస్తున్న 9వ అదనపు సెషన్స్ జడ్జిపై కరణ్ సింగ్ దాడి చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాని కోరారు.

చోరీలకు పాల్పడుతున్న ముఠా రిమాండ్

గోల్కొండ: తాళాలు ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం మెహిదీపట్నంలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 8న తన ఇంట్లో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని శేఖర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న లంగర్‌హౌస్ పోలీసులు లంగర్‌హౌస్ నుంచి గచ్చిబౌలి వరకు 100 సీసీ కెమెరాలను పరిశీలించి ఆరెసాయి(19), నెమలి డేవిడ్‌రాజ్ (18), మాగంటి సాయికుమార్ (22)ను పట్టుకున్నారు. దొంగతనాలు చేసి వచ్చే డబ్బులతో జల్సాలు చేసేవారు. ఆరె సాయి, డేవిడ్‌రాజ్ టైల్స్ పని చేసేవారు. మాగంటి సాయికుమార్ నీరు సరఫరా చేస్తూ కూకట్‌పల్లిలో ఉంటున్నాడు. ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడేవారని పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరిపై లంగర్‌హౌస్, చందానగర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు మరిన్ని ప్రాంతాల్లో కేసులు నమోదై ఉన్నాయి. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఈ నెల 14న వారి వారి ఇళ్లల్లో ఉండగా పట్టుకున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించామన్నారు. విలేకరుల సమావేశంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ కె.రఘుకుమార్, డీఐ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జి.చంద్రమోహన్

కత్తితో సంచరిస్తున్న పాత నేరస్తుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో కత్తితో సంచరిస్తున్న పాత నేరస్తుడిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన ఏసీ టెక్నీషియన్ మహ్మద్ అబ్దుల్ అన్సార్(24) చేసే పనికి ఖర్చులు చాలకపోవడంతో నేర జీవితాన్ని ఎంచుకున్నాడు. హత్య, దారిదోపిడీతో పాటు చాలా కేసుల్లో ప్రమేయముండడంతో ఫలక్‌నుమా పోలీసులు అతనిపై రౌడీషీట్ కూడా తెరిచారు. అయినా తీరు మార్చుకోకుండా అర్ధరాత్రి కత్తితో సంచరిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి నేతృత్వంలోని ఎస్సైల బృందం ఆంజనేయులు, నర్సింహులు, మహేష్, నవీన్‌ల బృందం శుక్రవారం రాత్రి అతన్ని అరెస్ట్ చేసింది. ఇతనిపై మల్కాజ్‌గిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్‌బీడబ్ల్యూ, దోపిడీ, భవానీనగర్ పరిధిలో హత్య కేసు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది.


అబ్దుల్ అన్వర్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. యాకుత్‌పురాలోని సయీద్ విల్లా ఫంక్షన్ హాల్ నిర్వహించిన కార్యక్రమంలో శనివారం ఆయన చార్మినార్ మండల పరిధిలో మంజూరైన 291 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గం పరిధిలోని చార్మినార్, బండ్లగూడ, సైదబాద్ మండల పరిధిలోని లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకలను అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్, పత్తార్‌గట్టి, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, అలందర్ వాలాజహి, చార్మినార్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి ఎమ్మెల్యేకు వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు తన దృష్టికి తెచ్చిన సమస్యలన్నిటినీ పరిష్కరించానన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చేసుకున్న దరఖాస్తులకు ఇంకా మంజూరీ రాకపోవడం తనకు వచ్చే ఫిర్యాదులు ఎక్కువగా ఉంటాయన్నారు. వాటన్నిటిని తాను అధికారుల దృష్టికి తెచ్చి దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలు తొలగించి లబ్ధిదారులకు దరఖాస్తులు మంజూరు అయ్యేలా చూస్తున్నానన్నారు.

వ్యక్తి అదృశ్యం


లఖన్‌సింగ్ (ఫైల్)

జియాగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భాస్కర్ వివరాల ప్రకారం.. పురానాపూల్ జియాగూడ ప్రాంతంలో ఉంటున్న లఖన్‌సింగ్ (33) ఆటో డ్రైవర్. గత నెల 31న ఇంటి నుంచి బయటకు వెళ్లిన లఖన్‌సింగ్ ఎంతకీ తిరికి రాలేదు. గతంలోనూ పలుమార్లు వెళ్లిన ఐదారు రోజుల తర్వాత వచ్చేవాడు. ఈ సారి వెళ్లిన లఖన్‌సింగ్ 15 రోజులైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు

ఏటీఎం కేంద్రంలో చోరీకి యత్నం

గౌలిపురా: ఏటీఎం కేంద్రంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించి విఫలమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం..శాలిబండ రాజేశ్ మెడికల్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో శనివారం తెల్లవారు జామున 3.50 గంటలకు ఓ గుర్తు తెలియని వ్యక్తి లోనికి ప్రవేశించి మెషీన్‌ను ధ్వంసం చేసి డబ్బులను దొంగలించేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ విషయాన్ని గమనించిన సర్వీసు మేనేజర్ ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ మహమ్మద్ రఫీకి సమాచారం అందజేశాడు. బ్రాంచ్ మేనేజర్ మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్థానికంగా సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కాగా ఏటీఎం కేంద్రంలో రూ.7,70,100ల నగదు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు గుర్తించి ఎలాంటి నగదును దొంగతనం జరగలేదన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

గన్‌ఫౌండ్రీ: నేటి తరం విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని క్యూరీ ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకుడు డాక్టర్ సత్యప్రసాద్ లంకా అన్నారు. శనివారం అబిడ్స్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో క్యూరీ ప్రాజెక్ట్ విభాగంలో భాగంగా కళాశాలలో రోబోటిక్స్, ఇంటర్నేట్ ఆఫ్ థింగ్స్ లెబోరోటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థుల కోసం ఈ ప్రయోగశాలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. త్రిడీ ప్రింటర్ విభిన్న పరిశ్రమలలో విస్తృతమైన ప్రయోజనాలను కలిగి ఉంటుందని గుర్తు చేశారు. ఇంజినీర్‌లు, డిజైనర్ల కోసం వేగవంతమైన ఫొటో టైపింగ్ ఈ పరికరం ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. ఇంజినీరింగ్, జీవశాస్త్రం, డిజైనింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ లెర్నింగ్ కోసం ఎంతగానో ఈ పరికరం సహకరిస్తుందని అదేవిధంగా నిర్మాణ రంగంలో త్రిడీ ప్రింటర్ ఇళ్లను నిర్మించడంలో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కె.కృష్ణారావు, కంపెనీ ఎండీ పి.శ్రీనివాస్, కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు టి.రాకేష్‌రెడ్డి, ఆర్.ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సత్యప్రసాద్ తదితరులు

ఎగ్జిబిషన్‌లో స్టాళ్ల నిర్వాహకులకు ఉత్తమ అవార్డులు



ఉత్తమ అవార్డులు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

అఫ్జల్‌గంజ్: ఎగ్జిబిషన్‌లో పలు స్టాళ్ల నిర్వాహకులతో పాటు విద్యుత్ అమ్యూజ్‌మెంట్ ఇతర విభాగాల వారికి ఉత్తమ అవార్డులను రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు శనివారం అందజేశారు. మహ్మద్ జావేద్, మహ్మద్ మాజీద్, ముజామిల్ షరీఫ్, సయ్యద్ ఉస్సేన్ షరీఫ్, మొహ్మద్ మొయినుద్దీన్‌లకు ఉత్తమ అవార్డులు అందజేసి అభినందించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు మిధాని కృషి

సంతోష్‌నగర్: మిశ్రు ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా శనివారం నారాయణగూడలోని వ్యాధి నిరోధక ఔషధ సంస్థ అధికారులకు ట్రూనాట్ యంత్రాన్ని మిధాని సంస్థ అదనపు ఇన్‌చార్జి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.గౌరీ శంకర్ రావు అందజేశారు. క్షయ వ్యాధి విభాగానికి చెందిన ప్రభుత్వ అధికారుల అభ్యర్థన మేరకు క్షయ వ్యాధిని ముందుగా గుర్తించేందుకు ఉపయోగపడే రూ.16.55 లక్షల ఆధునాతన ట్రూనాట్ యంత్రాన్ని అధికారులకు అందించామని గౌరీ శంకర్ రావు తెలిపారు. మిధాని సంస్థ రూ.66.51 లక్షల ఖర్చుతో హైదరాబాద్‌లోని 1500 మంది క్షయ వ్యాధి రోగులకు పోషకాహార సామగ్రితో ఆరు నెలల కాలం పాటు సరిపడ ఖర్చులను విరాళంగా అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మిధాని మానవ వనరుల నిర్వాహణ జనరల్ మేనేజర్ ఎ.రామకృష్ణ రావు, ఆర్థిక, అకౌంటింగ్ జనరల్ మేనేజర్ కె.మధుబాల, మానవ వనరుల నిర్వహణ అదనపు జనరల్ మేనేజర్ వి.హరికృష్ణ, సీనియర్ మేనేజర్ ఎ.ఆర్.రష్మి, క్షయ వ్యాధి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజేశం, రాష్ట్ర క్షయ వ్యాధి నియంత్రణ అధికారిణి డాక్టర్ చలాదేవి తదితరులు పాల్గొన్నారు.


ట్రూనాట్ యంత్రాన్ని అందజేస్తున్న గౌరీ శంకర్ రావు

'నిషేధిత వస్తువులు అమ్మితే కఠిన చర్యలు'

గోల్కొండ: కిరాణా షాపులు, పాన్ డబ్బాలలో నిషేధిత గుట్కాలు, పాన్ మసాలలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. గుట్కాలు, ఇతర మత్తు పదార్థాలు సమాజాన్ని ముఖ్యంగా యువతను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. వివిధ రకాల మత్తు పదార్థాలను విక్రేతలు మారు పేర్లతో రకరకాల ప్యాకింగ్‌లలో అనుమానం లేకుండా విక్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాలు లేని నగరంగా మార్చడమే తమ లక్ష్యమని, ఈ దిశగా మత్తు పదార్థాలు, గుట్కాలు అమ్మే వారిపై దాడులు చేస్తున్నామన్నారు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సహకరించాలని గుట్కాలు, ఇతర మత్తు పదార్థాలు అమ్మే వారి వివరాలు తమకు తెలపాలని ఆయన కోరారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


జీఎం జాన్‌షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా వాటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం వాటర్‌బోర్డు జీఎం జాన్‌షరీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..వేసవికాలం ప్రారంభం కావడంతో నియోజకవర్గంలోని జాంబాగ్, ధూల్‌పేట్, బేగంబజార్, ఫీల్‌ఖానా, గౌలిగూడ, ఎంజేమార్కెట్ తదితర ప్రాంతాల్లో నీటి సమస్యలు ప్రారంభమయ్యాయన్నారు. అధికారులు ప్రతిరోజు ఆయా ప్రాంతాల్లో పర్యటించి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కులశేఖర్, నరేష్ గౌడ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

4 నెలల్లో సార్లు కూలింది!

గోషామహల్ నాలా నిర్మాణ పనులు విచిత్రంగా కొనసాగుతున్నాయి. గత నాలుగు నెలల్లో నాలుగుసార్లు నాలా కూలడంతో స్థానికులు, అధికారులు భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా శనివారం నాలా మరమ్మతులు చేస్తుండగా భవాని వైన్స్ ముందు కొంత మేరకు నాలా నేలమట్టమైంది. విషయం తెలుసుకున్న గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ నాలాను ఆయన సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. – అబిడ్స్



సకల దేవతలకు నిలయం.. శంకర్‌జీ హనుమాన్‌జీ దేవస్థానం

- మహాశివరాత్రికి ఏర్పాట్లు ముమ్మరం
- హాజరు కానున్న అశేష భక్తజనం


శంకర్‌జీ హనుమాన్‌జీ దేవస్థానం

జియాగూడ: ఈ నెల 26 జరిగే మహాశివ రాత్రి సందర్భంగా శివాలయాలలో ఏర్పాట్లు మొదలయ్యాయి. రహీంపురా సత్తెన్నగల్లి కాగాజగూడలోని చారిత్రక శంకర్‌జీ హనుమాన్‌జీ దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర..

ఈ ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో ఆలయ పరిసరాలు వ్యవసాయ భూములు. నాగలితో భూమిని దున్నుతున్న సమయంలో మహా శివుడు, నందీశ్వరుడు, రుక్మిణిదేవి, విఠలేశ్వరుడి పాలరాతి విగ్రహాలు బయటపడటంతో స్థానికులు ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. నాటి నుంచి పూజలందుకొంటున్న ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతనంగా ఆలయ వెనుక భాగాన నూతనంగా పెద్ద ఆలయాన్ని నిర్మించి అందులో శివాలయం, వేంకటేశ్వర స్వామి గణపతి, కుమారస్వామి, లక్ష్మీ, పార్వతి, సరస్వతి దేవి, ఆంజనేయులు, నవగ్రహాలు, నాగదేవత, అయ్యప్ప స్వామి తదితర విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే అయ్యప్ప స్వాముల కోసం ప్రత్యేకంగా గదులను నిర్మించి దీక్ష చేసుకోవడానికి అన్ని వసతులు కల్పించి, మాలధారులకు 45 రోజుల పాటు అల్పాంహారం ఇస్తున్నారు.


మహా శివుడు

శుభకార్యాలకు నెలవు..

ఈ ఆలయంలో వివాహాది శుభకార్యాలకు బస్తీలవాసులు మాట ముచ్చట చేసుకుంటారు. దీంతో అంతా శుభం జరుగుతుందని ప్రగాఢవిశ్వాసం. ప్రతి పండుగకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించడంతో ఆలయానికి భక్తులు తాకిడి అధికంగా ఉంటుంది.

శివరాత్రికి శివపార్వతుల కల్యాణ మహోత్సవం..

ఈ ఆలయంలో 26న మహాశివ రాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజామున 4 గంటల నుంచే అభిషేకాలు, రుద్రాభిషేకాల, ప్రత్యేక అలంకరణలు, రాత్రికి సాముహిక మల్లికార్జున భ్రమరాంబ దేవీలకు కల్యాణం, పల్లకీ సేవా, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భావ అభిషేకం, భజనలు జోరుగా నిర్వహిస్తామని ఆలయ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ పూర్ణ చందర్ తెలిపారు.

వేడుకలను వైభవంగా నిర్వహిస్తాం..



ఆలయంలో మహాశివ రాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నాం. అందుకు అన్ని ఏర్పాటు చేశాం. శివ పార్వతుల కల్యాణం ప్రత్యేక ఆకర్షణంగా ఉంటుంది.
– గోడిశాల నరేష్ గౌడ్, ఆలయ ధర్మకర్త

ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత..



ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతా, బారికేడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల అలంకరణ తదితర పనులను చేపడుతున్నాం. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.
– కంది మోహన్ గౌడ్, ఆలయ ధర్మకర్త